పది ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


పెచ్చెట్టి సౌజన్య


జి.దీపిక


మంచెం దేవి శివశ్రీ


వలవల చంద్రశేఖర్


తాడి రాణి సౌమ్యారెడ్డి


బండారు పావని


కె.నటరాజ్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలో ఉన్న మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో 540 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 366 మంది ఉత్తీర్ణత సాధించారు. బీవీఆర్ఎం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పూసరపు హర్షిణి 585 మార్కులతో పట్టణంలో ప్రథమస్థానం, కవురు జాహ్నవి 584 మార్కులతో ద్వితీయ స్థానం, పెచ్చెట్టి సౌజన్య 579 మార్కులతో పట్టణంలో తృతీయ స్థానంలో నిలిచారు. మొత్తం మూడు స్థానాలు ఒకే పాఠశాలకు రావడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 75 శాతం ఉత్తీర్ణత సాదించినట్లు ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు. మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలల నుంచి 591 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 444 మంది ఉత్తీర్ణులు కాగా 147 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. రామన్నపాలెం పంచాయతీ పీపీ తోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పులపర్తి జాహ్నవి 582 మార్కులు, జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పితాని లక్ష్మీ నాగశ్రీ 582 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం సాధించారన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యా కుసుమాలు వికసించాయి. సోమవారం విడుదలైన ఫలితాల్లో పెనుగొండ మండలంలో 478 మంది విద్యార్థులు హాజరు కాగా 270 మంది ఉత్తీర్ణులై 56 శాతం సాధించారు. ఆచంట మండలంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 449 మంది విద్యార్థులు గానూ 335 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వల్లూరు ఎంపీ పాలెం మట్ట సింధు (588/600), యు.సౌమ్య (569/600) ఆచంట మండల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నారు. పెనుగొండ మండలంలో ప్రథమ స్థానంలో దేవలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలకు చెందిన జీ దీపిక 570/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలోనే, వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.జగన్ తేజ 567/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు.

యలమంచిలి మండలంలో....

యలమంచిలి: పదో తరగతి ఫలితాల్లో యలమంచిలి మండల విద్యార్థులు ఆశాజనక ఫలితాలు సాధించారు. మండలంలో మొత్తం 11 జిల్లా పరిషత్ హైస్కూల్స్ నుంచి 580 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 76 శాతంతో 443 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మట్లపాలెం పేరిచర్ల సుబ్బరాజు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గుబ్బల మీనాక్షి 588 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించగా కొంతేరు హైస్కూల్ విద్యార్థిని మంచెం దేవి శివశ్రీ 562 మార్కులతో ద్వితీయ స్థానం, దొడ్డిపట్ల హైస్కూల్ విద్యార్థిని వలవల చంద్రశేఖర్ 559 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.

పోడూరులో..

పోడూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ హైస్కూళ్లకు సంబంధించి మండలవ్యాప్తంగా 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిన్నూరు జెడ్పీ హైస్కూల్లో 87 శాతం, పెనుమదం జెడ్పీ హైస్కూల్లో 60 శాతం, కవిటం జెడ్పీ హైస్కూల్లో 80 శాతం, పోడూరు జెడ్పీహైస్కూల్లో 59 శాతం, గుమ్మలూరు జెడ్పీ హైస్కూల్లో 71 శాతం, వేడంగి జెడ్పీ హైస్కూల్లో 100 శాతం, కొమ్ముచిక్కాల జెడ్పీ హైస్కూల్లో 62 శాతం, పండితవిల్లూరు జెడ్పీ హైస్కూల్లో 33 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 392 మంది పరీక్షలకు హాజరుకాగా, 292 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తాడి రాణి సౌమ్యారెడ్డి 562 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలకు చెందిన సత్తి మాధవీలత 560, నెగ్గిపూడి గురుకుల పాఠశాలకు చెందిన సానబోయిన హర్షవర్ధని 560 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం నిలిచినట్లు ఆయన తెలిపారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పలువురు విద్యార్థులు పది పరీక్షల్లో ప్రతిభ చూపారు. మత్స్యకార గురుకుల పాఠశాలకు చెందిన బూరి విగ్నేష్ 581 మార్కులతో ప్రథమస్థానంలో నిలవగా ఎల్‌బీచర్లలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు కె.నటరాజ్ 577 మార్కులు సాధించగా ఇదే పాఠశాలకు చెందిన డి.దాసు 574 మార్కులు సాధించాడు. చిట్టవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చల్లా హర్షవర్ధన్ 559 మార్కులు సాధించగా, చినమామిడిపల్లి మున్సిఫల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బండారు పావని 552 మార్కులు సాధించింది. మండలంలో 1,197 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 843 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మండలంలో 70.4శాతం ఉత్తీరత సాధించామన్నారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి అత్యధికంగా సారవ ఉన్నత పాఠశాలలో 90శాతం ఉత్తీర్ణత సాధించారని, గురుకుల పాఠశాలలకు సంబంధించి బాలికలు 99 శాతం ఉత్తీర్ణులు కాగా, మత్స్యకార గురుకుల పాఠశాల 97 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఆగని వలంటీర్ల రాజీనామాలు


పాలకొల్లు మునిసిపల్ కార్యాలయానికి రాజీనామా లేఖలతో వచ్చిన వలంటీర్లు


మేడపాడులో కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు


వేడంగిలో మూకుమ్మడిగా రాజీనామా లేఖలతో వలంటీర్లు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు సోమవారం తెలిపారు. రాజకీయ నాయకులు తమపై వ్యక్తిగత నిఘాతో వేధిస్తున్నారని, తమకు స్వేచ్ఛలేని కారణంగా రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు పేర్కొనట్లు ఆయన తెలిపారు. మండలంలోని కాళీపట్నం తూర్పు నుంచి 11 మంది, మొగల్తూరు 4 సచివాలయాల పరిధిలో 7 మంది, రామన్నపాలెం ఇద్దరు,, పేరుపాలెం సౌత్ ఒకరు, కేపీపాలెం సౌత్ ఒకరు, ముత్యాలపల్లి ఒకరు, కొత్తోట ఒకరు, పేరుపాలెం నార్త్ ఒకరు, మోడి ఒకరు, కొత్తపాలెం ఒకరు, కెపిపాలెం నార్త్ నుంచి 1 వలంటీర్ తమ రాజీనామాలను ఆయా గ్రామ కార్యాదర్శులకు అందజేశారని ఎంపీడీఓ తెలిపారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రతిపక్ష నాయకుల వేధింపులను తట్టుకోలేక యలమంచిలిలో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. సోమవారం అబ్బిరాజుపాలెం, మేడపాడు, యలమంచిలి, కొంతేరు, బూరుగుపల్లి గ్రామాల వలంటీర్లంతా మూకుమ్మడిగా రాజీనామలు చేసి, రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులు మాదాసు హరిప్రసాద్, పాలా శారదా శ్రీనివాస్, గౌరీ భవానీలకు అందజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి తమపై ఆంక్షలు విధించడంతో స్వేచ్ఛగా తిరగలేక ఈ రాజీనామాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోడూరులో..

పోడూరు: వేడంగి గ్రామానికి చెందిన 14 మంది గ్రామ వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. గ్రామంలో మొత్తం 22 మంది వలంటీర్లు ఉండగా వారిలో 14 మంది రాజీనామా చేశారు. మిగతా 8 మంది కూడా త్వరలో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేసిన వలంటీర్లు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. తాము ఐదేళ్లగా ప్రజలకు నిస్వార్థంగా, పారదర్శకంగా సేవలందిస్తుంటే ఎన్నికల కోడ్ పేరుతో తమ సేవలకు ఆటంకం కలిగించడంపై మనస్తాపంతో రాజీనామా చేశామని వలంటీర్లు చెబుతున్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: తెలుగుదేశం, జనసేన అధినేతలు పలు సందర్భాల్లో వలంటీర్ల ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసి అవమానించారని పాలకొల్లు పట్టణంలోని 1, 2 వార్డులకు చెందిన వలంటీర్లు పేర్కొన్నారు. పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ఆ వార్డులకు చెందిన 16 మంది వలంటీర్లు రాజీనామలు చేసి ఆ లేఖలను మునిసిపల్ కమిషనర్ పార్థసారథికి అందజేశారు. ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని తమకు కలుగజేసిన సీఎం జగన్ వెంట మేమంతా సిద్ధంగా ఉంటామన్నారు. వలంటీర్ల వెంట వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు ఇన్‌చార్జ్‌లు యలకల రంగ, ఇజ్జాడ చినబాబు, శంకరాపు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆగర్తిపాలెంలో

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం సచివాలయంలో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శి కె బుల్లిరాజుకు అందజేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరుపట్ల తమ మనస్సు నొచ్చుకుందన్నారు. సీఎం జగన్ సొంత గ్రామంలో తమకు ఉపాధి కల్పించి వలంటీర్లుగా నియమించారన్నారు. ఎంతో గౌరవంగా పనిచేస్తున్న తమను అవమానిస్తూ మాట్లాడిన ప్రతిపక్ష నేతలకు కాలమే సమాధానం చెబుతుందని పలువురు వలంటీర్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు వలంటీర్లకు సంఘీభావం తెలిపారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం


మొగల్తూరు: కుక్కలవారితోటలో ప్రచారం చేస్తున్న శ్రీ కృష్ణంరాజు, ఎమ్మెల్సీ శ్రీనివాస్


పెనుగొండ: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు

మొగల్తూరు: నరసాపురం అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీ కృష్ణంరాజు ఉత్సాహంగా ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం మొగల్తూరు పంచాయతీ పోతులవారి మెరక, కుక్కలవారితోట ప్రాంతంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీనుఅఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వార్డు సభ్యురాలు పొన్నపల్లి లక్ష్మి, మోటుపల్లి రాంభాస్కరరావు, బర్రి శంకరం బొక్కా నాగరాజు, మోకా నాగ శంకరం కుక్కల కృష్ణ మోహన్, కుక్కల మణి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండలో నిర్లక్ష్యంగా వదిలివేసిన శివారు ప్రాంత కాలనీలను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అధికారం చేపట్టిన అనంతరం అభివృద్ధి చేశారని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు తనయుడు చెరుకువాడ నరసింహరాజు అన్నారు. సోమవారం పెనుగొండలో నగరేశ్వర స్వామి కాలనీ(బీడు), కొడిపందేల దిబ్బ కాలనీల్లో వైఎస్సార్ సీపీ ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం పార్లమెంటు అభ్యర్థి గూడూరి ఉమాబాలలకు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించి, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. రూ.1.25 కోట్లుతో కోడి పందేల దిబ్బలో రహదారులు, రూ.80 లక్షలతో నగరేశ్వర స్వామి కాలనీలో రహదారుల నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, ఆకేటి చంటి, చెవ్వేటి రాజు, కోళ్ల అప్పారావు, గుడాల ఏసు, షేక్ మీరా షరీఫ్, పోడూరి రామయ్య, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్ కుమార్, మేడపాటి వీర్రెడ్డి, నౌడు దుర్గారావు, వెలగల శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజుకు శ్రీమంతుడు మద్దతు


శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు పలుకుతున్న శ్రీనివాస రెడ్డి(శ్రీమంతుడు)

పెనుగొండ: పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి(శ్రీమంతుడు) మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలసి మద్దతు ప్రకటించారు. సోమవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును, నరేష్ రాజులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ విజయానికి తనవంతు సహకారం పూర్తి స్థాయిలో అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ నెల 24న నత్తారామేశ్వరంలో జరగబోయే విస్తృత ప్రచారంలో పాల్గొని అత్యధిక మెజార్టీకికృషి చేస్తానన్నారు.

పాస్టర్ల ప్రార్థనలు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ అభ్యర్థి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విజయం సాధించాలని కాంక్షిస్తూ నియోజకవర్గ పాస్టర్ల ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో నియోజక వర్గ అభివృద్ధికి, ప్రజలకు పారదర్శకం సంక్షేమం అందించడం కోసం దేవుని కృప ఎల్లపూడి శ్రీరంగనాథరాజుపై ఉండి విజయం సాధించే విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాలకు చెందిన పాస్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోపి నామినేషన్‌ను విజయవంతం చేయాలి


పూలపల్లిలో మేమంతా సిద్ధం అంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఈ నెల 24వ తేదీ ఉదయం 10:48 నిమిషాలకు పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో యువజన విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు తెలిపారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషబాబు కార్యాలయంలో సోమవారం యువజన విభాగం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినిస్టన్‌బాబు మాట్లాడారు. బుధవారం ఉదయం 8 గంటలకు పూలపల్లి అంబేడ్కర్ సెంటర్‌కు జిల్లా, మండల, గ్రామ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో పాలకొల్లు మండల యువజన విభాగం అధ్యక్షుడు ఆకుల నాగమురళి, మండల జేసీఎస్ కన్వీనర్ రెడ్డిమాను నాగేంద్ర, తొండ శ్రీనివాస్, యువజన విభాగం నాయకులు దేవ రాజేష్‌కుమార్, అంగర రమేష్, మరపట్ల ప్రవీణ్, నేలపాటి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి పదవీ విరమణ సత్కారం


ప్రధానోపాధ్యాయురాలు సత్యవాణిని సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ చేసే వృత్తిపై అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు దానంతటదే వస్తుందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, మాజీ ఎంపీపీ కొండేటి రామకృష్ణలు అన్నారు. నరసాపురం మండలంలోని కాపులకొడప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరా వెంకట సత్యవాణి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, మాజీ ఎంపీపీ కొండేటి రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు తదితరులు మాట్లాడుతూ సత్యవాణి సేవలను కొనియాడారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చక్రధరరావు, సునీల్, ఐజాక్, ప్రధానోపాధ్యాయులు బాలనాగమణి, ప్రభావతి, కోలపర్తి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్, చామకూరి రాంబాబు, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు గుడాల గోపి నామినేషన్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) బుధవారం ఉదయం 10 గంటల 48 నిమిషాలకు పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీసూర్యా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ

నరసాపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీ సూర్యా ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపించారు. 99 శాతం ఉత్తీర్ణతతో పాటుగా, ఎక్కువ మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. బి.మోహనదేవి 586 మార్కులు, ఆర్.రోహిణి 526 మార్కులు, బి.మానిక 520 మార్కులు సాధించినట్టు చెప్పారు. అధిక శాతం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్టు వివరించారు. పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, డైరెక్టర్ ఘంటశాల హేమవల్లి, టెన్త్‌క్లాస్ ఇన్‌చార్జ్ డి.శ్రీకళ, ఏఓ పి.శ్రీనివాస్‌లు విద్యార్థులను అభినందించారు.

పది ఫలితాల్లో శ్రీగౌతమి విద్యార్థుల సత్తా


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చినిమిల్లి దుర్గాప్రసాద్

నరసాపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నరసాపురం శ్రీ గౌతమి ఇంగ్లిష్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ చెప్పారు. అయిత ఉజ్వలరాణి 590 మార్కులు, ఎం.అర్పిత 583 మార్కులు, ఎస్.విషిత 583 మార్కులు, వై.కీర్తి 577 మార్కులు, సీహెచ్ దీప్సికా 576 మార్కులు సాధినట్టు చెప్పారు. 98 శాతం ఉత్తీర్ణతతో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను దుర్గాప్రసాద్‌తో పాటు పాఠశాల సూపరింటెండెంట్ ఎండీ ఘఫార్‌ఖాన్, అధ్యాపకులు అభినంధించారు.

శశి విద్యార్థుల ప్రతిభ


వీఎస్‌డీ వర్షిత


ఎస్ హనుమ అఖిల్

పాలకొల్లు అర్బన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని దిగమర్రు శశి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని క్యాంపస్ ఇన్‌చార్జ్ బి.కిషోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌డీ వర్షిత, ఎస్.హనుమ అఖిల్ 593 మార్కులు సాధించారని తెలిపారు. కె.హృతిక్ సాయి 591 మార్కులు, వి.స్నిథిత 590 మార్కులు సాధించారన్నారు. అలాగే 580 మార్కులు పైగా 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. మొత్తం 143 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ ప్రత్యేకంగా అభినందించారు.

చర్చి నిర్మాణానికి రూ.30 వేలు ఆర్థిక సహాయం


నారినమెరకలో చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

యలమంచిలి: నారినమెరక గ్రామంలో చర్చి నిర్మాణానికి గుంపర్రు పంచాయతీ కడిమిపుంతకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కారుణ్య వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ తుంగా నాగేశ్వరరావు సోమవారం రూ.30 వేలు ఆర్థిక సహాయం చేశారు. పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన నారినమెరక గ్రామ పరిధిలో చర్చి నిర్మాణం చేపట్టారు. నిధుల కొరత వలన చర్చి నిర్మాణ పనులు వేగంగా జరగడం లేదు. ఈ నేపథ్యంలో చర్చి నిర్వాహకులు పెసంగి సుబ్రహ్మణ్యం, కొల్లు పేతురు, ఇంజేటి శ్రీనులు సోమవారం నాగేశ్వరరావును కలిసి చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం కావాలని కోరగా ఆయన వెంటనే స్పందించి రూ.30 వేలు అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు సహాయం చేసిన నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ


బీఎస్ నారాయణరెడ్డి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో పూర్తి పారదర్శకంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బీఎస్ నారాయణరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 1,94,984 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 95,708 మంది, స్త్రీలు 99,270, హిజ్రాలు (ట్రాన్స్ జెండర్స్) ఆరుగురు ఉన్నారన్నారు. కొత్తగా 98 మంది ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకున్నారని, వీటిని వీఆర్వోలు విచారణ చేస్తున్నారన్నారు. మొత్తం 190 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. వీటిలో పాలకొల్లు రూరల్ 58, పాలకొల్లు అర్బన్ 49, పోడూరు 26, యలమంచిలి 57 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల సామాగ్రి సరఫరా చేసేందుకు 21 రూట్లుగా విభజించామని, వీటిలో పెదలంక, కనకాయలంక గ్రామాలకు ప్రత్యేకంగా ఒక రూటుగా విభజన చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 4 టీమ్‌లు, సర్వేకల్ టీమ్‌లు 4, వీడియో సర్వేకల్ టీమ్‌లు 7 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 85 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులు 1118 మంది ఉన్నారని, వీరిలో 173 మంది ఇంటి వద్ద ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని, అలాగే 2167 మంది దివ్యాంగులు ఉన్నారని, వీరిలో 150 మంది ఇంటి వద్ద ఓటు వేసుకునేందుకు దరఖాస్తు చేశారన్నారు. 3027 మంది పోస్టల్ బ్యాలెట్‌కి అర్హులున్నారని, వీరిలో పీఓలు, ఏపీఓలు, 1009మంది, అత్యవసర విభాగాలకు చెందిన 153 మంది పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా మే 6, 7,8 తేదీల్లో వారికి ఓటు ఉన్న ప్రాంతంలో ఓటు వేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి 95 లక్షలు ఎన్నికల ఖర్చులు చేయాలని వివరించారు. ప్రతీ రోజూ అభ్యర్థుల ఖర్చుల వివరాలు వీడియో ద్వారా రికార్డు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు.